సాక్షి కర్నూలు

శనివారం ‌। 19 ‌। ఆగస్టు ‌। 2023

I



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై శుక్రవారం విజయవాడ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన నప్పా శివకుమార్ బృందం నిర్వహించిన సంప్రదాయ నృత్యం అలరించింది.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు చేపట్టారు.



కేఆర్ఎంబీ చైర్మన్ పరిశీలన

జూపాడుబంగ్లా: కృష్ణా బోర్డు చైర్మన్ (కేఆర్ఎంబీ) శివానందకుమార్ శుక్రవారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. పోతిరెడ్డిపా డు విస్తరణ, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

ఆదోనిలో సెప్టెంబర్ 18 నుంచి గణేశ్ ఉత్సవాలు



గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలో గణేశ్ వేడుకలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బసవన్నగౌడ్, కమిటీ సభ్యులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, గోవిందరాజుగౌడ్ మాట్లాడారు. సెప్టెంబర్ 18వ తేదీన వినాయ విగ్రహాల ప్రతిష్ట ఉంటుందని, వేడుకల అనంతరం సెప్టెంబర్ 22న నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు దరఖాస్తులు భర్తీ చేసి ఉత్సవ కమిటీకి అందించాలన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సమితి సభ్యులు దేవిశెట్టి ప్రకాష్, శ్రీకాంత్‌రెడ్డి, ఈరన్నరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.8 వేలకు చేరిన పత్తి ధర



యార్డుకు అమ్మకానికి వచ్చిన పత్తి

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి ధర రూ.8 వేలకు చేరింది. రోజురోజుకు రూ.100 పెరుగుతున్న ధర శుక్రవారం రూ.8,029 నమోదైంది. మార్కెట్‌కు 580 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ట ధర రూ.8029, మధ్య ధర రూ.7429, కనిష్ట ధర రూ.5477 పలికింది. అదేవిధంగా వేరుశనగలు 2,167 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.8,320, మధ్య ధర రూ.7,389, కనిష్ట ధర రూ.3609.. ఆముదాలు 89 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.6,093, మధ్య ధర రూ.5,990, కనిష్ట ధర రూ.5,309 నమోదైంది.

గ్రూప్-1, 2 ఉచిత శిక్షణకు రేపు ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): ఏపీ స్టడీ సర్కిల్ బ్రాంచీల్లో త్వరలో ప్రారంభం కానున్న సివిల్ సర్వీసెస్, గ్రూప్ -1, 2 ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో ఉన్న బ్రాంచీల్లో శిక్షణ పొందేందుకు ఇప్పటికే 11,008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో ఎంచుకున్న కేంద్రాల్లోనే ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు apstdc.apcfss.in పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.58కోట్ల వైద్య పరికరాలు



నిర్మాణంలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.58కోట్ల విలువైన వైద్య పరికరాలను మంజూరు చేసింది. ఇందులో రెండు లీనర్ యాక్సిలేటర్లు, హెచ్‌డీఆర్ బ్రాకీ యూనిట్స్, 3 టెస్లా సామర్థ్యం కలిగిన ఎంఆర్ఐ మిషన్, 120 స్లైడ్స్ సామర్థ్యం గల సీటీ స్కాన్ తదితర మిషన్లు ఉన్నాయి. ఇలాంటి మిషన్లు ప్రస్తుతం ప్రైవేటులోనూ లేవు. వీటిని కేవలం క్యాన్సర్ రోగులకు మాత్రమే ఉపయోగించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు.

ఇంటింటి ఓటరు సర్వే త్వరగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

కర్నూలు(సెంట్రల్): ఇంటింటి ఓటరు సర్వేను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఈనెల 21వ తేదీతో ఇంటింటి సర్వే ముగుస్తుందన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా సవరణపై కలెక్టర్లు, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆయనకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు డీఆర్వో నాగేశ్వరరావు, ఈఆర్ఓలు మల్లికార్జునుడు, రమ హాజరయ్యారు.

కరువు నేలలో డ్రాగన్ సిరులు



చీడపీడల బెడద ఉండదు



ఈ చిత్రంలోని రైతు పేరు వెంకటేష్ (9985403008). ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం గ్రామానికి చెందిన ఈయన 2022 జూన్‌లో రెండు ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశారు. ఎకరాకు రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. గుంటూరు జిల్లా నుంచి రూ.60 ప్రకారం ఎకరాకు 2000 మొక్కలు తెప్పించారు. ఎకరాకు 500 సిమెంటు దిమ్మెలు నాటి ఒక్కోదానికి 4 మొక్కలు నాటారు. ఇప్పటి వరకు రెండు టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.1.50 లక్షల ప్రకారం విక్రయించగా.. ఇంకా 2 నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు చెబుతున్నారు. పంటకు చీడపీడల బెడద ఉండదని, నీళ్ల అవసరం కూడా తక్కువే అని ఆయన తెలిపారు.

రాబడి ఎక్కువ



ఈ రైతుపేరు రాజారెడ్డి (9154871980). నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వారు. ఎంబీఏ పూర్తి చేశారు. 2020లో నాలుగు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. రెండు సంవత్సరాలుగా పంట తీస్తున్నారు. ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. టన్నుకు సగటున రూ.1.30 లక్షల ధర లభిస్తోందని ఈ రైతు తెలిపారు. ఈయన తైవాన్ పింక్, ఎస్ఐఏం రెడ్ రకాలతో నర్సరీ కూడా ఏర్పాటు చేశారు. రైతులకు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఉద్యాన పంటలతో పోలిస్తే డ్రాగన్‌ఫ్రూట్స్‌లో రాబడి ఎక్కువగా ఉంటుందని ఈయన చెప్పారు.

మార్కెట్‌లో మంచి ధర

ఇటీవల కాలంలో డ్రాగన్‌ఫ్రూట్ వినియోగం పెరుగుతోంది. రక్తవృద్ధికి, రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ఈ పండును తీసుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. హోల్‌సేల్‌గా టన్ను కనీస ధర రూ.లక్ష ఉంటోంది. గరిష్టంగా రూ.1.50 లక్షలు పలుకుతోంది. ఈ పంట సాగు చేసిన రైతుకు ఎకరాకు రూ.10 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న డ్రాగన్ ఫ్రూట్ సాగు
- మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి వ్యయం
- నాల్గో ఏడాది నుంచి ఎకరాకు 10 టన్నులకుపైగా దిగుబడి
- మార్కెట్‌లో టన్ను ధర రూ.1.30 లక్షలు



జిల్లాలో సాగైన తోటలో కాసిన డ్రాగన్ ఫ్రూట్స్

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధార భూములు.. ఏటా పంట వేసినా వరుణుడు కరుణిస్తేనే పండుతుంది. లేదంటే నష్టాలు మూటగట్టుకోవాల్సిందే. ఈ దుస్థితి నుంచి బయటపడేందుకు కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించారు. సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నారు. సబ్సిడీలు ఇస్తూ రాష్ట్రప్రభుత్వం ఈ పంట సాగును ప్రోత్సహిస్తోంది. నాలుగేళ్ల క్రితం దేవనకొండ మండలం కరివేములలో ఒక్కరైతు డ్రాగన్‌ఫ్రూట్ తోటను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 మంది రైతులు దాదాపు 130 ఎకరాల్లో తోటలను వృద్ధి చేసుకున్నారు. ఈ ఏడాది సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

తక్కువ నీటితో సాగు..

డ్రాగన్‌ఫ్రూట్ ఎడారి మొక్క. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. చీడపీడల బెడద ఉండదు. మొదటి ఏడాదిలోనే కాపునకు వస్తుంది. అయితే దిగుబడులు అంతగా ఉండవు. నాలుగో ఏడాది నుంచి ఎకరాకు సగటున 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గతంలో మొక్కలను గుంటూరు నుంచి తీసుకొచ్చే వారు. గతేడాది నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నర్సరీలు ఏర్పాటయ్యాయి. ప్రత్యేకంగా డ్రాగన్‌ఫ్రూట్ ఫామ్స్ కూడా అభివృద్ధి చెందాయి. వీటిలో తైవాన్ పింక్, ఎస్ఐఏఎం రెడ్ రకాల మొక్కలు రూ.50 ప్రకారం లభిస్తున్నాయి. సాగుకు సిమెంట్ పోల్స్ అవసరం. ఎకరాకు 500 వరకు నాటుకోవాల్సి ఉంటుంది. ఒక్కపోల్‌కు 4 ప్రకారం ఎకరాకు 2000 మొక్కలు నాటుతున్నారు.

పాతికేళ్ల వరకు పంట

మొదటి ఏడాది ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి వ్యయం వస్తుంది. రెండో ఏడాది నుంచి ఎరువులకు మినహా ప్రత్యేకంగా పెట్టుబడులు ఉండే అవకాశం లేదు. ఏడాదిలో ఆరు నెలల పాటు కాపు వస్తుంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు పంట ఉండదు. ఒకసారి నాటితే పాతికేళ్ల వరకు పంట వస్తుంది. మూడు, నాలుగేళ్ల వరకు మధ్యలో అంతరపంటలుగా కూరగాయలు, కళింగర, కర్బూజ, ఇతర స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవచ్చు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇవీ..

➡ డ్రాగన్‌ఫ్రూట్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

➡ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీ ఇస్తోంది.

➡ జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులందరూ 100 శాతం సబ్సిడీతో సాగు చేసుకోవడానికి అర్హులు.

➡ గరిష్టంగా ఒక రైతుకు 'ఉపాధి' కింద రూ.1.80 లక్షల సబ్సిడీ లభిస్తుంది.

➡ ఉద్యాన శాఖ మొక్కల కొనుగోలుకు హెక్టారుకు రూ.32 వేల ప్రకారం గరిష్టంగా రెండు హెక్టార్లకు సబ్సిడీ ఇస్తోంది.

➡ డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు బిందు సేద్యం తప్పనిసరి. ఏపీఎంఐపీ ద్వారా ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం సదుపాయం కల్పిస్తోంది.

➡ 2022-23లో జిల్లాలో 11 మంది రైతులకు 20 ఎకరాలకు బిందు సేద్యం సదుపాయం కల్పించారు.

'ఉపాధి'లో వంద శాతం సబ్సిడీ

జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు పెరుగుతోంది. ఈ పంట సాగులో మొదటి ఏడాది రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి వస్తుంది. నాలుగో ఏడాది నుంచి ఎకరాకు 10 టన్నులకుపైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. టన్ను ధర రూ. లక్షల నుంచి 1.50 లక్షల వరకు లభించే అవకాశం ఉంది. 'ఉపాధి'లో 100 శాతం సబ్సిడీ లభిస్తుంది.

– రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి

ఉద్యోగుల నేస్తం సీఎం వైఎస్ జగన్

- ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ స్నేహపూర్వకంగా మెలుగుతున్నారని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఆయన పలువురు ఎన్‌జీఓ నేతలతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం 21 రాష్ట్ర మహాసభలను ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరైన విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాసభలకు మొదటి రోజు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2వేల మంది పాల్గొంటామన్నారు. మహాసభలకు హాజరయ్యే ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రత్యేక సెలవులు ప్రకటించిందని తెలిపారు.

- అన్ని శాఖల ఉద్యోగులతో పాటు ఆర్‌టీసీ, పబ్లిక్ సెక్టారు, అవుట్‌సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులు, త్వరలోనే రెగ్యులర్ కాబోతున్న కాంట్రాక్టు ఉద్యోగులు కూడా హాజరవుతారన్నారు.
- 2014 జూన్ 2 నాటికి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా నియమితులై కొనసాగుతున్న వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుండటం హర్షణీయమన్నారు.
- ఆర్‌టీసీలో కారుణ్య నియామకాలు పూర్తి చేస్తుండటం, కరోనాతో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.
- విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హంద్రీ- నీవాలో కృష్ణమ్మ పరవళ్లు



మల్లెపల్లె పంపింగ్ స్టేషన్ నుంచి కృష్ణగిరి వైపు వెళ్తున్న కృష్ణా జలాలు

వెల్దుర్తి: హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రధాన కాలువలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి అనంతపురం వైపు నీరు తరలించే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. కృష్ణా జలాలు గురువారం రాత్రి మల్లెపల్లె పంపింగ్ స్టేషన్‌కు చేరాయి. ఇక్కడి నుంచి శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో ఒక పంపు ద్వారా నీటిని లిఫ్ట్ చేసి 337 క్యూసెక్కుల నీటిని, తిరిగి ఉదయం 10 గంటలకు మరో పంపు ద్వారా మరో 337 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు ఇంజినీర్లు రవి, అమర్ తెలిపారు. ఈ నీరు శుక్రవారం రాత్రికి కృష్ణగిరి పంపింగ్ స్టేషన్‌కు చేరుకుంటాయన్నారు. హంద్రీ- నీవా ప్రధాన కాల్వలో ప్రవాహం ఉండటంతో భూగర్భజలాలు పెరగనున్నాయి. కాలువ పరిసరాల్లో పొలాలు పచ్చగా మారనున్నాయి. పలు గ్రామాలకు మంచి నీటి సమస్య తీరనుంది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయిలో నిండకపోయినా బ్యాక్‌వాటర్‌ను హంద్రీ-నీవా కాలువ ద్వారా తరలించేందుకు కృషి చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డికి రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేడే ఉప సం'గ్రామం'

- ఒక సర్పంచు, 15 వార్డులకు ఎన్నికలు
- ఉదయం 7 గంటలకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు
- సాయంత్రానికి ఫలితాల వెల్లడి





బదినేహాల్‌లోని పాఠశాలలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఉపఎన్నికలు జరగనున్నాయి. ఆదోని డివిజన్‌లోని కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ పంచాయతీ సర్పంచు స్థానంతో పాటు వేర్వేరు గ్రామ పంచాయతీల్లోని 15 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 6వన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఒక సర్పంచుతో పాటు మొత్తం 42 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే 25 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 15 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. బదినేహాల్ సర్పంచు స్థానానికి ఇద్దరు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 15 వార్డు సభ్యుల స్థానాలకు 32 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు 38 మంది అధికారులు ...

జిల్లాలోని వేర్వేరు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉప ఎన్నికలను నిర్వహించేందుకు 16 మంది స్టేజ్ -2 రిటర్నింగ్ అధికారులు, 22 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికలు ఎక్కడెక్కడంటే ...

మండలం	గ్రామ పంచాయతీ	వార్డు నంబర్/సర్పంచు	బరిలో ఉన్న అభ్యర్థులు	ఓటర్ల వివరాలు
కోడుమూరు	గోరంట్ల	6	3	280
కోడుమూరు	ప్యాలకుర్తి	1	2	402
కర్నూలు	ఉల్చాల	11	2	418
పెద్దకడుబూరు	కల్లుకుంట	11	3	297
పెద్దకడుబూరు	గంగులపాడు	5	2	157
కౌతాళం	రౌడురు	6	2	166
హొళగుంద	చిన్నహ్యాట	9	2	196
హొళగుంద	మద్దిలింగదహళ్లి	3	2	121
ఓర్వకల్లు	శకునాల	10	2	196
ఓర్వకల్లు	ఓర్వకల్లు	7	2	344
ఓర్వకల్లు	బ్రాహ్మణపల్లి	7	2	123
ఆదోని	104 బసాపురం	2	2	228
ఆదోని	పెద్దతుంబలం	14	2	495
వెల్దుర్తి	లక్ష్మీనగరం	2	2	244
వెల్దుర్తి	బొమ్మిరెడ్డిపల్లె	3	2	139
కౌతాళం	బదినేహాల్	సర్పంచు	2	3171

సాయంత్రానికి ఫలితాలు ...

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఎక్కడైనా అనుకోని సంఘటనలు చోటు చేసుకొని పోలింగ్‌కు అంతరాయం ఏర్పడితే మరుసటి రోజున (20వ తేదీన) ఎన్నికలు నిర్వహించనున్నారు. బదినేహాల్ గ్రామ పంచాయతీలోని 3,171 మంది ఓటర్లను కలుపుకొని ఎన్నికలు జరుగుతున్న 15 వార్డుల్లో మొత్తం 6,977 మంది ఓటర్లు ఉన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. పొరపాట్లు చోటు చేసుకోకుండా స్టేజ్ -2 రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు ఒక రోజు శిక్షణను ఇప్పించాం. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతరత్రా మెటీరియల్‌ను కూడా సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలకు ఇప్పటికే చేరవేశాం.

– నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన

కర్నూలు(సెంట్రల్): చివరి దశలో ఉన్న ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన సూచించారు. శుక్రవారం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, ఎంఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 211 ప్రాధాన్యత భవన నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయన్నారు. వీటిలో 51 భవనాల్లో మాత్రమే అన్ని రకాల పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన భవనాల పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్ ఏఈలను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో బిలో బేస్మెంట్ లెవల్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆగస్టు 31 నాటికి బేస్మెంట్ లెవల్‌కి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణగిరి, చిప్పగిరి, వెల్దుర్తి, కౌతాళం, కర్నూలు అర్బన్, కల్లూరు, పత్తికొండ, మంత్రాలయం, తుగ్గలి, కోసిగి, ఎమ్మిగనూరు ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు సమీక్షించుకుని గృహ నిర్మాణాల్లో పురోగతి చూపేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మూడో శుక్రవారం ఉద్యోగుల 'స్పందన'



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన


ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకుచర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇక నుంచి ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి ఆమె పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచినీటిలో ఉత్పత్తి చెందే దోమలతో డెంగీ, మలేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. మంచినీటి నిల్వలకు సంబంధించి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్వీ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డీటీడీసీ కొరియర్‌కు 'వినియోగదారు కమిషన్' షాక్

కర్నూలు(లీగల్): పార్సిల్‌ను గమ్యస్థానానికి చేర్చని డీటీడీసీ కొరియర్ సర్వీస్‌కు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ షాక్ ఇచ్చింది. పార్సిల్ డెలివరీ చేయకపోవడం సేవా లోపమని, అనైతిక వ్యాపారమని స్పష్టం చేసింది. పార్సిల్‌లో బుక్ చేసిన వస్తువుల విలువతో పాటు పరిహారం, కోర్టు ఖర్చులకు రూ.60 వేలతో పాటు పార్సిల్‌లో ఉన్న మందుల విలువకు సమానంగా రూ.1.71 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ శుక్రవారం ఆదేశించింది. పిటిషనర్ పేర్కొన్న మేరకు... కర్నూలు పట్టణానికి చెందిన పరాస్ మెడికల్ ఏజెన్సీకి చెందిన ప్రకాష్ చంద్ 2018 అక్టోబర్ 27న హైదరాబాదులోని ఓ ఫార్మా కంపెనీకి డీటీడీసీ కొరియర్‌లో ఒక పార్సిల్‌ను పంపారు. ఈ పార్సిల్‌లో రూ.1.71 లక్షల విలువైన మందులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ పార్సిల్‌ను డీటీడీసీ గమ్యస్థానానికి చేర్చలేదు. దీంతో ప్రకాష్ చంద్ కొరియర్ సిబ్బందిని ప్రశ్నించగా... పార్సిల్ కనిపించడం లేదని, ఎక్కడుందో వెతుకుతున్నామని ఈ-మెయిల్ ద్వారా తెలిపారు. నెలలు గడిచినా ప్రయోజనం లేకపోవడంతో ప్రకాష్ చంద్ తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు పంపారు. తర్వాత కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు దాఖలు చేశారు.



ప'రాయి'కి పచ్చని తోడు

అవి రాళ్లే కావచ్చు. కఠినంగా ఉండవచ్చు. ఎవరినీ ఆకర్షించకపోవచ్చు. అయితే వాటిని ఒంటరిగా వదిలేయకుండా.. చుట్టూ పచ్చదనం అల్లుకుంది. కంటికి ఇంపైన సొగసులను అద్దింది. మేఘావృతమైన నీల వర్ణంలోని ఆకాశం కూడా తోడై సరికొత్త సోయగాన్ని ఆవిష్కరించింది. నంద్యాల జిల్లా యాగంటి, కర్నూలు జిల్లా దేవనకొండ సమీపంలో ఈ దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



రాజీ కాదగిన కేసులను పరిష్కరించండి

- రెండు జిల్లాల ఎస్పీలతో న్యాయ సేవాధికార చైర్మన్ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎస్. శ్రీనివాసరావు, చిత్రంలో ఇరు జిల్లాల ఎస్పీలు

కర్నూలు: పెండింగ్‌లో ఉండి రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున పెండింగ్ కేసుల పరిష్కారంపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు కర్నూలు, నంద్యాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ ఆఫీసర్ టి.సర్కార్‌తో పాటు పలువురు పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కాంపౌండబుల్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ కాదగిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించగలిగితే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. కోర్టుల్లో ఉన్న కేసులను మానిటరింగ్ చేసుకునే బాధ్యతను కోర్టు కానిస్టేబుళ్లకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల అడ్మిన్ అడిషనల్ ఎస్పీ బి.వెంకటరాముడుతో పాటు నంద్యాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

12 ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : వెల్దుర్తి మండలంలోని బుక్కాపురంలో అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి తరలించడానికి సిద్ధంగా ఉన్న 12 ట్రాక్టర్లు, జేసీబీని గురువారం రాత్రి 12 గంటలకు పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు, జేసీబీని పోలీసులు మైనింగ్ అధికారులకు అప్పగించారన్నారు. ఆ వాహనాల యజమానులకు రూ.1.50 లక్షలు జరిమానా విధించామని చెప్పారు.

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచండి



కర్నూలు రేంజ్ డీఐజీని కలసిన సీఐలు

కర్నూలు : ప్రజలకు ఉత్తమ సేవలు అందించి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలని ఇటీవల సీఐలుగా పదోన్నతి పొందిన వారికి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సూచించారు. రాయలసీమ రేంజ్ పరిధిలో కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన 41 మంది ఎస్‌ఐలు ఇటీవలే పదోన్నతి పొందారు. శుక్రవారం వీరంతా కర్నూలు బి.క్యాంప్‌లోని రేంజ్ కార్యాలయంలో డీఐజీ సెంథిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ వారితో మాట్లాడుతూ బాధ్యతాయుతమైన సేవలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు.

రైతుల సహకారంతో పీఏసీఎస్‌ల అభివృద్ధి

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



వెంకాయపల్లెలోని పసుపుల సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, చిత్రంలో కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ విజయమనోహరి

కర్నూలు (న్యూటౌన్): రైతుల సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌ల)ను అభివృద్ధి చేస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం కర్నూలు మండలం వెంకాయపల్లెలో పసుపుల పీఏసీఎస్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొసైటీలకు నిధులిచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేస్తున్నారన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో 300 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ స్టాంపింగ్ సేవలను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీకి సంబంధించిన విలువైన ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామన్నారు. అనంతరం వైఎస్సార్ రైతు నేస్తం కింద నలుగురు రైతులకు పంట రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేసిన సీఈఓ మురళీధర్‌చౌదరిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, సొసైటీ చైర్మన్‌లు శేషిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి ఎస్. రామాంజనేయులు, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, సహకార బ్యాంక్ సీఈఓ పి. రామాంజనేయులు, కేడీసీసీ బ్యాంక్ జీఎం ఓఎస్‌డీ ఎం. విజయ్ కుమార్, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఏసేపు పాల్గొన్నారు.

'నకిలీ సర్టిఫికెట్ల' బాగోతంపై విచారణ

- క్రిమినల్ కేసు ఉన్నప్పటికీ మహిళా ఉద్యోగికి అక్రమంగా పదోన్నతి
- ఏపీఎస్పీ అడిషనల్ డీజీ ఆదేశాల మేరకు కొనసాగుతున్న విచారణ



ఏపీఎస్పీ రెండో పటాలం ప్రధాన కార్యాలయం

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో నకిలీ సర్టిఫికెట్లతో మహిళా ఉద్యోగి పదోన్నతి పొందిన బాగోతంపై రెండు రోజులుగా విచారణ కొనసాగుతోంది. విధి నిర్వహణలో తండ్రి మృతిచెందగా కుమార్తె కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. అయితే విధుల్లో చేరడానికి ఇంటర్ పూర్తి చేసి ఉండాలనే నిబంధన ఉంది. అయినప్పటికీ పదో తరగతి సర్టిఫికెట్లతో విధుల్లో చేరి ఇంటర్‌కు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు ఆ మహిళా ఉద్యోగిపై బెటాలియన్ ఆఫీసులో పనిచేసే సహోద్యోగులు కొందరు ఫిర్యాదు చేశారు. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై గతంలో కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదయ్యింది. ఈ మేరకు ఎక్సైజ్ కోర్టులో ఆమెపై నేరం రుజువై శిక్ష కూడా పడింది. అయితే ఆమె స్టే ద్వారా ఉద్యోగంలో కొనసాగుతున్నారు. అయితే ఇటీవల అధికారులను తప్పుదోవ పట్టించి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన విషయాన్ని కూడా సహోద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమెపై క్రిమినల్ కేసు ఉన్నప్పటికీ దొడ్డి దారిలో పదోన్నతి కల్పించారని ఫిర్యాదుల నేపథ్యంలో ఏపీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీసీ అతుల్ సింగ్ ఆదేశాల మేరకు నాల్గవ బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ రెండు రోజులుగా విచారణ జరుపుతున్నారు. గతంలో కమాండెంట్లుగా పనిచేసిన విజయకుమార్, నాగేశ్వరరావు, అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, గతంలో ఏవోగా పనిచేసిన రాజన్‌కు కూడా నోటీసులు జారీ చేసి జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మహిళాఉద్యోగిపై క్రిమినల్ కేసు ఉన్నప్పటికీ పదోన్నతి ఎలా కల్పించారనే అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. అయితే ఆమె ఉద్యోగంలో చేరినప్పుడు ఆమె విద్యార్హత, ఆ తర్వాత సమర్పించిన ఇంటర్ నకిలీ సర్టిఫికెట్ల బాగోతంపై కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు సాగుతున్నట్లు బెటాలియన్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



వర్షిత (ఫైల్)

బనగానపల్లె: పట్టణంలోని కరీంబాగ్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని చింతా వర్షిత (16) రెండు రోజులుగా కనిపించడం లేదు. చింత వర్షిత స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కాగా తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో తల్లి రాజేశ్వరి దేవి ఈనెల 17వ తేదీన మందలించింది. దీంతో వర్షిత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద కుటుంబీకులు ఆరా తీసిన ఆచూకీ లేదు. దీంతో బాలిక తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విద్యార్థిని ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం మాలపల్లి క్రాస్ రోడ్డు దగ్గర అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ జయరాంనాయుడు తెలిపారు. ఎమ్మిగనూరులోని సెబ్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పట్టుబడిన బైకులు, మద్యంతోపాటు నిందితుల అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాలపల్లి క్రాస్ రోడ్డు దగ్గర తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు రెండు బైకులపై కర్ణాటక మద్యం తరలిస్తూ కనిపించారన్నారు. ఒకరు పారిపోగా ఇద్దరిని అరెస్ట్ చేశామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో గోనెగండ్ల మండలం గంజెళ్ల గ్రామానికి చెందిన అరవ ఉరుకుందు, ఎమ్మిగనూరు పట్టణం వెంకటాపురం కాలనీకి చెందిన నల్లబోతుల సమరం ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ లక్ష రూపాయలు ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే 9440902579కు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీలు గోపాల్, లింగ ప్రసాద్, షరీఫ్, రబ్బాని, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, రామచంద్రుడు, రాధమ్మ, భరత్ పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయింది, డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

ఎంఏ కోర్సుల్లో ప్రవేశానికి 26 వరకు అవకాశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో ఎంఏ(చరిత్ర-పురావస్తుశాస్త్రం) కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 26వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు వర్సిటీ పీఠాధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారే కాకుండా, ఆఫ్‌లైన్ ద్వారా అపరాధ రుసుంతో ప్రవేశం పొందవచ్చన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్ మరేదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాల కోసం 9441370591,9989240806 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ లీక్.. ఇల్లు ధ్వంసం

- ముగ్గురికి తీవ్ర గాయాలు



పేలుడు ధాటికి ఇంటి గోడలు పడిపోయిన దృశ్యం



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అవుకు: రామాపురం గ్రామంలో గ్యాస్ లీక్ అయ్యి పేలుడు ధాటికి ఇల్లు ధ్వంసమైంది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మొగ్గ చిన్న కంబగిరి, భార్య దస్తగిరమ్మ, కూతురు దస్తగిరమ్మ గురువారం రాత్రి భోజనం అనంతరం ఇంటి బయట నిద్రపోయారు. శుక్రవారం ఉదయాన్నే గనికి వెళ్లేందుకు నిద్రలేచి ఇంట్లోకి వెళ్లి తలుపు తీస్తుండగా గ్యాస్ లీకైన వాసన వచ్చింది. ఏమి జరిగిందోనని చూసేందుకు కంబగిరి స్విచ్ ఆన్ చేసి బల్బ్ వేశాడు. వెంటనే పేలుడు సంభవించింది ఇంటి గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్లాబ్ సైతం పక్కకు జరిగినట్లు కనిపిస్తోంది. పేలుడు ప్రభావంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గని పనులకు వెళ్లి కూడబెట్టుకున్న సొమ్ముతో ఇటీవల నిర్మించుకున్న ఇల్లు, సామగ్రి అంతా ఈ ప్రమాదంలో ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

30న ఐదు లక్షల ఇళ్ల ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

కర్నూలు(అర్బన్): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఐదు లక్షల ఇళ్లను ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్‌లోని సమావేశ భవనంలో ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ పీడీ కె.వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హౌసింగ్ రిటైర్డ్ ఈఎన్‌సీ కిషోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.నాగేశ్వరరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాల వేగాన్ని మరింత పెంచాలన్నారు. కర్నూలు జిల్లాకు 15,634 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం ఇచ్చారని, ఇప్పటివరకు 15,457 గృహ నిర్మాణాలను పూర్తి చేశారని, మిగిలిన 372 గృహాలను కూడా ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేస్తామని పీడీ వెంకటనారాయణ చెప్పారు. పీఎంజీఎస్‌వై గ్రామీణ్ కింద చేపట్టిన గృహనిర్మాణాలకు అవసరమైన ఆర్థిక చేయూతను అందించాల్సి ఉందన్నారు. అలాగే 2,732 గృహాలకు సంబంధించి సోక్‌పిట్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు పాలన అనుమతులను మంజూరు చేయాలన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి మంజూరైన 40 ఆర్చ్‌లు(వెల్‌కమ్ బోర్డ్స్)లను కూడా నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ఆయా కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర మౌలిక వసతులకు సంబంధించి ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు.

సాక్షి ఫ్యామిలీ
IV
కర్నూలు
శనివారం ॥ 19-8-2023

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండే వాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరక పోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.


దీప్తి మామిడి

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పు చారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.


తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను


ఆరతి కుమార్ రావు

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది.
బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.


'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.






చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్ది దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి


విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.

ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్నీ ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.



ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునే వాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.

హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.





వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ - వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.